క్లుప్తంగా

ఆహారం ప్యాకెట్ల పంపిణీ



గన్నవరం: మండలంలోని బుద్దవరం గ్రామంలో ఉన్న మహాత్మాగాంధీ సేవాసమితి వార్షికోత్సవం సందర్భంగా గురువారం అనాథలు, యాచకులకు ఆహారం ప్యాకెట్లు పంపిణీ చేశారు. సేవా సమితి చైర్మన్, బుద్దవరం గ్రామ ఉప సర్పంచ్ వేల్పూరి వెంకటబసవరావు ఆధ్వర్యంలో పెదఆవుటపల్లిలోని జోసఫ్ తంబి పుణ్యక్షేత్రం, గన్నవరం, గూడవల్లి ప్రాంతాల్లో 400 మందికి భోజన ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా బసవరావు మాట్లాడుతూ.. సేవా సమితి ద్వారా నిరాశ్రయులైన వృద్ధులు, అనాథలు, అభాగ్యులకు తమవంతు సాయం చేస్తున్నామన్నారు. సేవా సమితి ప్రారంభించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా అనాథలు, యాచకులకు ఆహారం అందజేశామని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు గండికోట నాగరాజు, ముద్రబోయిన వెంకన్న, మొర్ల రవీకుమార్, రెడ్డి నాగచైతన్య, వేల్పూరి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాటాలు అవసరం



కంకిపాడు: హక్కుల సాధనకు నిరంతర పోరాటాలు అవసరమని ఎస్సీ, ఎస్టీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇంటూరి ఏలియా అన్నారు. సమితి ప్రథమ మహాసభ కంకిపాడులో గురువారం నిర్వహించారు. ఏలియా మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమర్థంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు విద్య, వైద్యం పూర్తి ఉచితంగా అందించాలని, ప్రతి దళిత కుటుంబానికి రెండెకరాల భూమి సాగు చేసుకునేందుకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంబా ప్రభుదాసు, కోశాధికారి ఉయ్యాల ఏడుకొండలు, జిల్లా యూత్ అధ్యక్షుడు మద్దెల సాంబయ్య, జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో నేల సారవంతం



కంకిపాడు: పచ్చిరొట్ట పైర్ల సాగుతో నేల సారవంతంగా మారుతుందని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ఉప్పలూరు రైతుభరోసా కేంద్రంలో గురువారం పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఎంపీపీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ 50 శాతం రాయితీపై ప్రభుత్వం పిల్లిపెసర విత్తనాలను అందుబాటులో ఉంచిందన్నారు. నేలను పరిరక్షించుకోవటానికి, అధిక దిగుబడులు సాధించేందుకు పచ్చిరొట్ట పైర్లు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లాం సోనియా, ఎంపీటీసీ లాం పార్వతి, పీఏసీఎస్ చైర్మన్ మాగంటి శ్రీనివాసరావు, వీఏఏ సౌజన్య, రైతులు పాల్గొన్నారు.

స్వర్ణభారత్ ట్రస్ట్‌లో 30న ఉచిత వైద్యశిబిరం

ఉంగుటూరు: ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఈ నెల 30వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ ప్రశాంతి హాస్పిటల్స్, ఆంధ్రా హాస్పిటల్స్, భీమవరం విష్ణుదంత వైద్యశాల వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. శిబిరాన్ని ఆదివారం ఉదయం 8గంటలకు మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు ప్రారంభిస్తారని చెప్పారు. ఈ శిబిరంలో మూత్రశయ సమస్యలు, గుండె, ఎముకలు, ఊపిరితిత్తుల సమస్యలు, దంతాలు, సాధారణ జబ్బులకు వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. విజయవాడ శంకరనేత్ర చికిత్సాలయం వైద్యులు కంటి పరీక్షలు చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగించుకోవాలని కోరారు.

గొలుసు చోరీ నిందితుల కోసం గాలింపు

కంకిపాడు: గొలుసు చోరీ నిందితుల కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు జరుపుతున్నారు. మండలంలోని వేల్పూరు గ్రామంలో ఈనెల 19న వృద్ధురాలి మెడలో నానుతాడు (గొలుసు)ను ముగ్గురు యువకులు బైక్‌పై వచ్చి తెంచుకుని పరారయ్యారు. ఘటనపై కంకిపాడు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా చోరీకి పాల్పడ్డ ముగ్గురు యువకులను గుర్తించారు. ఆ యువకులు నిడమానూరు ప్రాంత వాసులుగా తేల్చారు. సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నిందితుల కోసం పలు ప్రాంతాల్లో గాలించారు. సెల్ ఫోన్ సిగ్నల్స్, సోషల్ మీడియా ఖాతాల వినియోగం ద్వారా నిందితులను పట్టుకునే పనిలో కంకిపాడు పోలీసులు నిమగ్నమయ్యారు.

9 నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో వచ్చే నెల 9 నుంచి 14వ తేదీ వరకు హనుమజ్జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని ఆలయ పాలక మండలి చైర్మన్ నెరుసు భూషణం, కార్యానిర్వాహణాధికారి కూడిపూడి శ్రీనివాస్ తెలిపారు. హనుమజ్జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రిక, వాల్‌పోస్టర్లు, కరపత్రాలను అభయాంజనేయుని సన్నిధిలో దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ముందుగా ప్రచార సామగ్రికి ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు, అర్చకులు శృంగారం వెంకట శేషారామానుజాచార్యులు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. గత 21 ఏళ్లగా జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాలకు దీటుగా ఈ ఏడాది కూడా వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభినట్లు చైర్మన్ నెరుసు భూషణం తెలిపారు. స్వామి వారి ఆలయంలో చిన్నారులకు అన్నప్రాసన, చెవిప్రోగులు కుట్టించుకునేందుకు వీలుగా దేవస్థానం వెనుక ప్రాంగణంలో ఉత్సవమూర్తితో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశామన్నారు.

గరికపాటి ప్రవచనం..

ఉత్సవాల తొలి రోజైన 9వ తేదీ నుంచి ప్రతి రోజు 1,008 వివిధ పూలతో ప్రత్యేక పూజ, హనుమాన్ చాలీసా పారాయణం, సాయంత్రం బంగారు, వెండి పుష్పాలతో విశేష అర్చన, కోలాటం ప్రదర్శన, మ్యాజిక్ షో, మ్యూజికల్ నైట్ కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. 12న 'పద్మశ్రీ' గరికపాటి నరసింహారావుచే ప్రవచనం, మ్యూజికల్ నైట్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 13న నవకలశ స్నపన, శాంతిహోమం, సింధూరార్చన, సప్తనది జలాలతో అభిషేకం, సాయంత్రం స్వామి వారికి బంగారు, వెండి పుష్పాలతో అర్చన, డ్యాన్స్ బేబి డ్యాన్స్, కూచిపూడి నాటక ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల చివరి రోజైన హనుమజ్జయంతి పురస్కరించుకుని వేకువజామున పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, సాయంత్రం స్వామివారి లడ్డూ ప్రసాదం వేలంపాట అనంతరం భారీ ఊరేగింపు జరుగుతుందని తెలిపారు. లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో హనుమజ్జయంతి రోజున భారీ అన్న సమారాధన నిర్వహిస్తామన్నారు. ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ కొండేటి కనకదుర్గారావు, పుర ప్రముఖులు సుంకర సుభాష్‌చంద్రబోస్, మేడేపూడి రామ్మోహనరావు, అడుసుమిల్లి రామ్మోహనరావు, చిన్నాల నాగేశ్వరరావు, బోయపాటి పూర్ణచంద్రరావు, తాడి రంగారావు, సవలావరపు సీతారామయ్య పాల్గొన్నారు.



హనుమజ్జయంతి వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్ కనకదుర్గాప్రసాద్, ఆలయ చైర్మన్ భూషణం

సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలి

జిల్లా పరిషత్ సీఈవో జ్యోతిబసు

పెనమలూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వి.జ్యోతిబసు అన్నారు. ఆయన గురువారం పెదపులిపాక గ్రామంలో సచివాలయాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పేదలందరికీ ఇళ్ల పథకంలో లబ్ధిదారులను ప్రోత్సహించి గృహనిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులను ప్రోత్సహించి గృహాలు నిర్మాణం చేసే విధంగా కృషి చేయాలని తెలిపారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కారం చేయాలని అన్నారు.

సంపదల తయారీ కేంద్రం తనిఖీ..

గ్రామంలో చెత్త నుంచి సంపదల తయారీ కేంద్రాన్ని సీఈవో జ్యోతిబసు తనిఖీ చేశారు. గ్రామంలో తడి చెత్త, పొడి చెత్త సేకరణ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెదపులిపాక గ్రామంలో పారిశుద్ధ్యం నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గుంటూరు శ్రీనివాసచౌదరి, ఎంపీడీఓ సునీతా శర్మ, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, ఈవో వి.పద్మావతి, డీపీఆర్‌సీ రిసోర్స్ పర్సన్ నవరత్నం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పెదపులిపాక గ్రామంలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో జ్యోతిబసు

చలివేంద్రాలు ప్రారంభం

ఉంగుటూరు: బాటచారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి అన్నారు. తేలప్రోలు గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శంకర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ లాం దిబోర, కార్యదర్శి కృపాకుమార్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గుడ్‌మార్నింగ్ వాకర్స్ ఆధ్వర్యంలో..

గన్నవరం: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గుడ్‌మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నిడమర్తి సౌజన్య చేతుల మీదుగా మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు చిప్పాడ చంద్రశేఖర్ రావు మాట్లాడుతూ.. వాకర్స్, పాదచారుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు, ఫిజికల్ డైరెక్టర్ ధనియాల నాగరాజు, న్యాయవాది జాస్తి తాతారావు, వైఎస్సార్ సీపీ నేతలు జలసూత్రం రామ్మోహన్‌రావు, అగ్నిపర్తి అంబేడ్కర్ పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న సర్పంచ్ సౌజన్య, చంద్రశేఖర్‌రావు తదితరులు

ధాన్యం తరలింపుపై సమీక్ష

ఉయ్యూరు: ధాన్యం తోలిన రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని తహసీల్దార్ మస్తాన్ అన్నారు. మండలంలోని ముదునూరు సొసైటీలో ఆఫ్‌లైన్ ధాన్యం రైతులు, మిల్లర్లతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. తోలిన ధాన్యం, ఆన్‌లైన్ కాకపోవటానికి గల కారణాలు, ధాన్యం తీసుకున్న మిల్లర్లు, చెల్లించాల్సిన ధరలపై చర్చించారు. రైతులకు చెల్లింపులు జరపాలని మిల్లర్లకు సూచించారు. ఆన్‌లైన్ చేస్తే ఆఫ్‌లైన్ రైతులకు న్యాయం జరుగుతుందని మిల్లర్లు చెప్పారు. ముదునూరులో ధాన్యం కొనుగోళ్ల సమస్య ఉత్పన్నం కావటానికి కారణంగా రైతుభరోసా కేంద్రం సిబ్బందేనని పీఏసీఎస్ చైర్మన్ పాలడుగు సత్యనారాయణ, ఏఎంసీ వైస్ చైర్మన్ దాసే రవి స్పష్టంచేశారు. టెక్నికల్ అసిస్టెంట్ వాసు తప్పిదం వల్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ తప్పిదం ఏమీ లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ మస్తాన్ తెలిపారు.



రైతులు, మిల్లర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ మస్తాన్

అంబేడ్కర్ స్మృతివనం పనుల పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): బందరురోడ్డులోని స్వరాజ్య మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం, 125 అడుగుల విగ్రహం పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆయన స్మృతివనం పనులను గురువారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు నిర్వహించాలని క్వాలిటీ కంట్రోల్ అధికారులను ఆదేశించారు. కారిడార్ మొత్తంలో గ్రానైట్ ఫుట్ పాత్, ల్యాండ్ స్కేఫ్, కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని పరిశీలించి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు, ఏపీఐఐసీ అధికారులు ప్రాజెక్ట్ కాంట్రాక్టర్ కేసీపీ ప్రతినిధులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ స్మృతివనం పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

సంక్షేమంతో ఆర్థిక పరిస్థితి మెరుగు

ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: సంక్షేమ పథకాల అమలుతో ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. మండలంలోని చిన ఓగిరాల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం కొనసాగింది. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పాలన వివరించి, ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధితో రూపొందించిన సంక్షేమ బ్రోచర్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కరోనా లాంటి విపత్కర పరిస్థితులను జయించామంటే సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలే అన్నారు. రాజకీయాలకు సంబంధం లేకుండా అర్హతే కొలమానంగా నేరుగా లబ్ధిదారుడి ఖాతాలోకే సంక్షేమ సొమ్ము జమ చేస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ ఆయా సేవలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువ చేశామన్నారు. రాజకీయాల్లో సామాజిక విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ప్రతిపక్షాలు కల్లబొల్లి మాటలు చెప్పి మాయ చేయాలని చూస్తే ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. సామాజిక న్యాయంపై మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదని స్పష్టంచేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ యార్లగడ్డ సాయి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గారపాటి నాని, నాయకులు మంచిగంటి నాగేశ్వరరావు, దోనేపూడి శ్రీహరి, మత్తే ఉదయభాను, కొడాలి విశ్వేశ్వరరావు, మంచిగంటి రమేష్, ఒణగంటి సాంబశివరావు పాల్గొన్నారు.



చిన ఓగిరాలలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పార్థసారథి

ప్రతి ఇంటా ప్రజానినాదంగా 'మా నమ్మకం నువ్వే జగన్'

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వైఎస్సార్ సీపీ పాలనలో కుల,మత, రాజకీయ వివక్ష లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించటంతో ప్రతి ఇంట 'మా నమ్మకం నువ్వే జగన్' అనే నినాదం వినిపిస్తుందని ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ అన్నారు. బాపులపాడు మండలంలోని కోడూరుపాడులో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో పాటుగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి నేరుగా ప్రజలను కలిశారు.

గత టీడీపీ ప్రభుత్వ హాయంలో చంద్రబాబు పాలనకు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. పేద ప్రజలకు ఏదైనా మేలు జరిగిందంటే అది కేవలం వైఎస్సార్ సీపీ పాలనలో మాత్రమేనన్నారు. ఇలాంటి పేదల ప్రజల పక్షపాత ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ప్రజల అనుమతితో ఇంటికి జగనన్నే మా నమ్మకం స్టిక్కర్లను అంటించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, వైస్ ఎంపీపీ చందు రమాదేవి, పార్టీ నాయకులు చందు శ్రీనివాసరావు, చందు శివ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనతను అధిగమించొచ్చు

డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి

ఉయ్యూరు: పౌష్టికాహారంతో రక్తహీనత సమస్యను అధిగమించొచ్చని డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి సూచించారు. మండలంలోని ఆకునూరు ప్రభుత్వ పాఠశాలను గురువారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజనం, కిశోర బాలికల ఆరోగ్య వివరాలకు సంబంధించిన యాప్‌లను, రికార్డులను పరిశీలించారు. విద్యార్థినులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ గీతా బాయి మాట్లాడుతూ కౌమార దశలో ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రక్తహీనత లేకుండా పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందించే పదార్థాల్లో రక్తహీనతను అధికమించే పౌష్టికత ఉంటుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలల్లోనే భోజనం చేసేలా బాధ్యత తీసుకోవాలన్నారు. ఆకునూరు పాఠశాలలో డిసెంబర్ నెలలో 145 మంది బాలికలకు రక్త పరీక్షలు నిర్వహిస్తే 143 మందిలో రక్తహీనత సమస్య ఉందని తేలిందన్నారు. పీహెచ్‌సీ వైద్యులు రక్తహీనతకు సంబంధించిన మాత్రలు అందించి ఆహార పదార్థాలను కూడా తీసుకునేలా చూడటంతో ప్రస్తుతం 17 మందిలో రక్తహీనత సమస్య ఉందని గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రత్నగిరి, వైద్యాధికారులు డాక్టర్ రాకేష్ అనిల్, శ్వేతాబసు, హెచ్‌ఎం సలోమి పాల్గొన్నారు.



ఆకునూరు పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ గీతాబాయి

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి

కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి నిర్దేశించిన ఎనిమిది అంశాల లక్ష్యాలు సాధించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. జవహర్‌రెడ్డి గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, పాఠశాల విద్య, స్పందన అర్జీలు తదితర అంశాలపై సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జిల్లా ప్రగతిని వివరించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అనీమియాతో బాధపడుతున్న గర్భిణులు, కిశోర బాలికలు, పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ పిల్లలను గుర్తించి నివారణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలులో గ్రామంలో నెలలో రెండు సార్లు వైద్యబృందాలు 104 వాహనాల ద్వారా సందర్శించి బీపీ, షుగర్ వంటి వ్యాధులను గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, వైద్యసలహాలు అందించాలని సూచించారు. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా అవ్వా, తాతలకు నూరుశాతం కంటి పరీక్షలు నిర్వహించాలన్నారు. నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ పథకం ద్వారా ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో వైద్యులు, వైద్య సిబ్బంది ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాల భవనాలు, తరగతి గదుల మరమ్మతులు పాఠశాలలు పునఃప్రారంభం నాటికి పూర్తయ్యేలా చూడాలన్నారు. జగనన్న విద్యాకానుక పంపిణీకి ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. జేసీ అపరాజితాసింగ్, డీఎంహెచ్ఓ గీతాబాయి, డీఈఓ తాహెరాసుల్తానా, ఐసీడీఎస్ పీడీ ఎస్. సువర్ణ, కేఆర్‌ఆర్‌సీ డెప్యూటీ కలెక్టర్ శివనారాయణరెడ్డి, సీపీఓ వై. శ్రీలత, డీఎల్‌డీఓ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు. చిత్రంలో జేసీ అపరాజితాసింగ్, అధికారులు

కుటుంబ సభ్యులపై దాడి

పెనమలూరు: మద్యానికి బానిసగా మారిన భర్త తన భార్య, కుమార్తెపై క్రికెట్ బ్యాట్‌తో దాడి చేయటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిశోర్‌బాబు మాట్లాడుతూ పోరంకి ప్రభునగర్‌లో మద్దాలి సీతాలక్ష్మి భర్త అప్పలనాయుడుతో ఉంటుంది. అయితే భర్త మద్యానికి బానిసగా మారి తరచుగా కుటుంబ సభ్యులతో గొడవ పడసాగాడు. ఈ నేపథ్యంలో గురువారం అప్పలనాయుడు మద్యం సేవించి వచ్చి భార్య సీతాలక్ష్మి, కుమార్తె పూజితతో తగాదాపడి క్రికెట్ బ్యాట్‌తో వారిపై దాడి చేశాడు. ఈ ఘటనలో గాయపడిన తల్లి, కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వరకట్న వేధింపులపై కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ కిశోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం కానూరు సనత్‌నగర్‌కు చెందిన ఎండీ కతీజా గత రెండు సంవత్సరాల క్రితం ఎండీ హసన్ ఆలీని వివాహం చేసుకుంది. వీరికి పాప పుట్టింది. పెళ్లి సమయంలో ఇచ్చిన కట్నకానుకలు చాల్లేదని భర్తతో పాటు అత్త తాహీరాబేగం, మరిది హాశం ఆలీ వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు అత్తింటివారిపై కేసు నమోదు చేశారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో హనుమాన్‌జంక్షన్‌లోని జేఎంజే మహిళా జూనియర్ కాలేజీ విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభతో రాష్ట్రస్థాయి మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ సిస్టర్ ఆంథోనమ్మ గురువారం తెలిపారు. ఎంపీసీ విభాగంలో ఫస్టియర్ విద్యార్థిని ఆర్.శాంతి 470 మార్కులకు 464 మార్కులతో రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిల్చిందన్నారు. బైపీసీ గ్రూపులో ఫస్టియర్ విద్యార్థిని టి.భవాని 440 మార్కులకు 421 మార్కులు, సీఈసీ గ్రూపులో కె.శృతి 500 మార్కులకు 457 మార్కులు సాధించారన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో ఎంపీసీ గ్రూపులో టి.అనూజ 986 మార్కులు, బైపీసీలో ఎం.హిమబిందు 969 మార్కులు సాధించారని తెలిపారు. వీరిని ప్రిన్సిపాల్‌తో పాటు ఇతర అధ్యాపకులు అభినందించారు.



శాంతి (464/470)

ఇంటర్‌లో 71 శాతం ఉత్తీర్ణత

ఉయ్యూరు: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో 71 శాతం ఉత్తీర్ణత సాధించామని ఏజీఅండ్ ఎస్‌జీ సిద్ధార్థ జూనియర్ కళాశాల డైరెక్టర్ జీజేపీ వినయ్‌కుమార్ తెలిపారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో దుర్గామణికంఠ ఎంపీసీలో (958/1000), మౌనిక (949/1000), షాహీనా బేగం (943/1000) సాధించారన్నారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో సుష్మ (451/470), డానియేల్ (439/470) సుల్తానా (433/470) సాధించారన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఫలితాల్లో ప్రతిభ చాటడం అభినందనీయమన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

పెనమలూరు: పెనమలూరు సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు అవ్వటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరుకు చెందిన మట్టామేరీ కామయ్యతోపులో చిరు వ్యాపారం చేస్తుంది. ఆమె వ్యాపారం ముగించుకుని స్కూటీ పై ఇంటికి బయటుదేరి పెనమలూరు సెంటర్ వద్దకు రాగా.. వెనుక నుంచి వచ్చిన బైక్ ఆమెను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమె రోడ్డుపై పడి గాయపడింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

దాసరి జీవితం ఆదర్శనీయం

గన్నవరం: స్థానిక సీపీఐ కార్యాలయంలో కమ్యూనిస్టు ఉద్యమ నేత దాసరి నాగభూషణం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి చిత్రపటానికి రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్కామల ఉమామహేశ్వరరావు, సీపీఐ ఏరియా కార్యదర్శి పెద్దు వాసుదేవరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముక్కామల మాట్లాడుతూ...విద్యార్థి దశ నుంచి పేదల హక్కుల కోసం దాసరి అనేక పోరాటాలు చేశారని తెలిపారు. నూజివీడు తాలుకా కమ్యూనిస్టు కార్యదర్శి నుంచి అంచెలంచెలుగా రాష్ట్ర కార్యదర్శిగా ఎదిగిన ఆయన జీవితం ఆదర్శనీయమన్నారు. పార్టీ నేతలు కెఆర్ఎం.జోషి, కె.విజయరావు, సీహెచ్.వెంకటేశ్వరరావు, గోళ్ల రామచంద్రరావు పాల్గొన్నారు.

కంకిపాడులో పారిశుద్ధ్య పనులు

కంకిపాడు: పట్టణంలోని లాకురోడ్డులో పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు గురువారం చేపట్టారు. రోడ్డు మార్జిన్‌లలోకి వచ్చిన చెట్లు, కంప తొలగించి రాకపోకలకు వీలుగా మార్గాన్ని సరిచేశారు. రోడ్డు మార్జిన్‌లలో పేరుకున్న వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. పనులను ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి పర్యవేక్షించారు.

సుస్వరాల మూర్తి.. దక్షిణామూర్తి

విజయవాడ కల్చరల్: సుస్వరాల మూర్తి దక్షిణామూర్తి అని తెలుగు కళావాహిని అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు కొనియాడారు. పోలవరపు కోటేశ్వరరావు సాహితీ పీఠం, తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై సినీ పాటల రచయిత సుసర్ల దక్షిణామూర్తి, సినీ నటుడు ఎన్టీఆర్ శత జయంతి సంత్సర వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమాలను గురువారం ఘనంగా నిర్వహించారు. గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. తెలుగు సినీ జగత్తులో అద్భుత సాహిత్యానికి బాణీలను చేకూర్చి సినీ కళామతల్లికి స్వరనీరాజనం అందించిన సుసర్ల సంగీత సేవలు మరువలేమన్నారు. సినీ నటుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా, స్టూడియో నిర్మాతగా ఎన్టీఆర్ ఎన్నో విజయాలు సాధించారని గుర్తుచేశారు. డాక్టర్ గుమ్మా సాంబశివరావు, శింగంశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అత్తింటివారిపై కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గంగూరు కరెంట్ ఆఫీస్ కాలువ కట్టకు చెందిన ఈడుపుగంటి శ్రవంతి గత 2019లో అదే ప్రాంతానికి చెందిన రవితేజను వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. వీరికి పాప పుట్టింది. అయితే ఇచ్చిన కట్నం చాల్లేదని అదనపు కట్నం తీసుకురమ్మని భర్తతో పాటు అత్త ప్రేమావతి, మామా వేణు, మరిది వంశీ వేధించటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు అత్తింటివారిపై కేసు నమోదు చేశారు.